క్లుప్తంగా

రేపు విద్యుత్ వినియోగదారుల సదస్సు

దామెర : మండల కేంద్రంలో ఈనెల 18న విద్యుత్ వినియోగదారుల సదస్సు (లోకల్ కోర్టు) నిర్వహించనున్నట్లు ఏఈ గుర్రం రమేశ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ సమీపంలో గల రైతు వేదికలో నిర్వహిస్తున్నామని, విద్యుత్ సమస్యలు నెలకొన్న వినియోగదారులు పాల్గొని ఫిర్యాదు చేయాలని సూచించారు. పరకాల సబ్ డివిజన్ పరిధిలోని దామెర, పరకాల టౌన్, రూరల్, నడికూడ, ఆత్మకూరు, శాయంపేట, మండలాల విద్యుత్ వినియోగదారులు సమస్యల పరిష్కారానికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సీజీఆర్ఎఫ్‌కు ప్రత్యక్షంగా అందించాలని తెలిపారు. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, విద్యుత్ పునరుద్ధరణ, బిల్లింగ్, కాలిన ట్రాన్స్‌ఫార్మర్, నూతన వ్యవసాయ, గృహ కనెక్షన్ల మంజూరు, అదనపులోడ్ క్రమబద్ధీకరణ, కేటగిరీ మార్పు, సర్వీసు రద్దు, పునరుద్ధరణ వంటి సమస్యలు పరిష్కరించుకోవాలని అన్నారు. సదస్సులో విద్యుత్ వినియోగదారుల చైర్మన్ గోపాలచారితో పాటు పలువురు సభ్యులు, స్థానిక ఏఈ గుర్రం రమేశ్ పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు వేలం

పరకాల : పరకాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు శుక్రవారం వేలంపాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ తాతాజీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. వాహనం అప్‌సెట్ ధరపై 50 శాతం డిపాజిట్‌గా చెల్లించి వేలంలో పాల్గొనాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పోగొట్టుకున్న బంగారు పుస్తెల అప్పగింత



ఐనవోలు : ధర్మసాగర్ మండలం జానకీపురం గ్రామానికి చెందిన యాట స్వప్న ఐనవోలు మల్లన్న జాతరలో గురువారం సాయంత్రం సుమారు 2లక్షల విలువచేసే 2.5 తులాల బంగారు పుస్తెలతాడు పోగొట్టుకుంది. కాగా బాధితురాలు వెంటనే కంట్రోల్ రూంలో ఉన్న పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎస్సై పస్తం శ్రీనివాస్ ఆలయ, పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఆధారంగా బంగారు పుస్తెలతాడును సిబ్బంది సహాయంతో పట్టుకుని బాధితురాలికి అప్పగించారు. దీంతో ఆమె పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

కేసు నమోదు

ఆత్మకూరు : బైక్ ఢీ కొని బాలుడిని గాయపర్చిన వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ సంతోశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని పెద్దాపూర్‌లో బుధవారం ఇంటి ఎదుట ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలుడు ఊరటి నిహాన్ష్‌ను అదే గ్రామానికి చెందిన గుండారపు అరవింద్ బైక్‌ను అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో నిహాన్ష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు బాలుడిని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. బాలుడి పెద్దమ్మ స్వర్ణలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంతోశ్ పేర్కొన్నారు.

నివాళి

పరకాల : అనారోగ్యంతో మృతిచెందిన రాజీపేట కాలనీకి చెందిన కాంగ్రెస్ కార్యకర్త ఏకు ప్రశాంత్ మృతదేహానికి ఆ పార్టీ నాయకులు గురువారం నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియాల్లో పాల్గొన్నారు. రామకృష్ణ, శ్రీనివాస్, కౌన్సిలర్ రాజు, యూత్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

కిరణ్మయికి డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని బయోటెక్నాలజీ విభాగం పరిశోధకురాలు జె.కిరణ్మయికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. స్టడీస్ ఆన్ క్యారెక్టరైజేషన్ అండ్ యాంటీ మైక్రోబియల్ యాక్టివిటీ ఆఫ్ యాక్టినోమైసెట్స్ ఐసోలేటెడ్ ఫ్రమ్ రిజోస్పెర్ సాయిల్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి కిరణ్మయికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీనివాస్ పర్యవేక్షణలో కిరణ్మయి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

వేయిస్తంభాల దేవాలయంలో పూజలు

హన్మకొండ కల్చరల్: హనుమకొండలోని రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయాన్ని తెలుగు జానపద, సినీ గేయ రచయిత ఉద్యమకారుడు మిట్టపల్లి సురేందర్ తన బృందంతో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో సురేందర్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మంద కుమార్ మాదిగ, నరేష్ మాదిగ, వేద పండితుడు గంగు మణికంఠ, అర్చకుడు సందీప్‌శర్మ, సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వ్యవసాయ బావులు

- రక్షణ గోడలు లేక భయాందోళన
- నిర్లక్ష్యం వహిస్తున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



హుజూరాబాద్ రోడ్డు సమీపంలో రక్షణ గోడలు లేకుండా ఉన్న వ్యవసాయ బావి

పరకాల : రక్షణ గోడలు లేని వ్యవసాయ బావులతో ప్రమాదం పొంచి ఉంది. వాహనాలు అదుపుతప్పి అమాయకుల ప్రాణాలు పోతున్నా కొందరు రైతులకు కనువిప్పు కావడం లేదని పలువురు ఆగ్రహిస్తున్నారు. అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. పరకాల మండల కేంద్రం నుంచి హుజూరాబాద్ రోడ్డు, వెల్లంపల్లి వైపు వెళ్లే ప్రధాన రహదారుల పక్కనే వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నామని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఈ మధ్యకాలంలో డబుల్ రోడ్డు పనులు, జాతీయ రహదారుల విస్తరణ జరగడంతో బావులు రోడ్లకు మరింత దగ్గరయ్యాయి. ఈ దారిగుండా నిత్యం వేలాది వాహనాలు రవాణా చేస్తుండడంతో అదుపు తప్పితే పెద్ద ప్రమదం సంభవించే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం నుంచి నడికూడ వరకు వెళ్లే హుజూరాబాద్ రోడ్డు పక్కనే ఐదు వ్యవసాయ బావులు ఏలాంటి రక్షణ గోడలు లేకుండా పొదల మాటున పొంచి ఉండగా.. గ్రామాల్లోకి వెళ్లే రహదారులు మలుపులతో ప్రమాదకరంగా మారాయని అంటున్నారు. ఏడాది క్రితం వెల్లంపల్లి రోడ్డు నుంచి నడికూడ వైపు వచ్చే క్రమంలో వాహనం అదుపు తప్పి వ్యవసాయ బావిలో పడగా భార్యభర్తతో పాటు మూడేళ్ల చిన్నారి మృతిచెందినా అధికారులు స్పందించకపోవడం సరికాదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. గ్రామానికి వెళ్తున్న ప్రైవేటు బస్సులు సమయానికి విద్యార్థులను చేర్చాలనే ఆలోచనతో వేగంగా నడుపుతున్నారు. ఇలాంటి సమయంలో ప్రమాదం జరిగితే ఊహించని నష్టం జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు.

కోలాహలంగా లక్ష్మీనృసింహస్వామి జాతర



స్వామివారిని దర్శించుకుంటున్న నాయకులు

దామెర : మండలంలోని ఊరుగొండలో గల లక్ష్మీనృసింహస్వామి జాతర రెండోరోజు కోలాహలంగా కొనసాగుతోంది. గురువారం ఉదయం నుంచే స్వామి వారికిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దత్తున జాతరకు చేరుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు తూపురాణి శ్రీనివాసాచార్యులు అర్చన, అభిషేకాలు జరిపించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. జాతరకు వచ్చే భక్తులకు రేవూరి మిత్రమండలి ఆధ్వర్యంలో అధ్యక్షుడు కూనాటి రామకృష్ణారెడ్డి వాటర్ బాటిళ్లు చితంగా పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు, జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి, జంగిలి నాగరాజు, మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్‌కుమార్, సీనియర్ నాయకులు వీసం రమణారెడ్డి, సూర చందర్, మాదారపు రతన్ కుమార్, రవికిరణ్ పాల్గొన్నారు.

రేషన్ కార్డుల మంజూరు కాంగ్రెస్‌తోనే సాధ్యం



పరకాల : సర్వేను పరిశీలిస్తున్న కౌన్సిలర్ సంపత్‌కుమార్



వేలేరు : రైతు భరోసా ఫీల్డ్ వెరిఫికేషన్ చేస్తున్న అధికారులు

పరకాల : రాష్ట్రంలోని నిరుపేదలకు రేషన్ కార్డుల మంజూరు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే సాధ్యమవుతుందని మున్సిపాలిటీ 1వ వార్డు కౌన్సిలర్ మడికొండ సంపత్‌కుమార్ అన్నారు. రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవడం, వార్డు అధికారులు చేపట్టిన సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్క కుటుంబానికి రేషన్ కార్డు మంజూరు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డుల మంజూరు కోసం గ్రామాల్లో చేపట్టిన సర్వే గురువారం ప్రారంభమైంది. ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలు ఈనెల 26వ తేదీన ప్రారంభించనున్న నేపథ్యంలో గురువారం మండలంలోని హుస్సేన్‌పల్లి, జోగంపల్లి గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు సర్వే చేపట్టారు.

వేలేరు : మండలంలోని వివిధ గ్రామాల్లో రైతు భరోసా, రేషన్ కార్డుల ఫీల్డ్ వెరిఫికేషన్‌ను రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గురువారం ప్రారంభించారు. పట్టా భూముల్లో ఇళ్ల నిర్మాణం, రోడ్లు, కాల్వలు, గుట్టలు, రాళ్లు, సాగు యోగ్యత లేని భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అదే విధంగా రేషన్ కార్డుల జారీకి పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికెళ్లి వివరాలు సేకరించారు.

కుక్కలతో భయం భయం..



ప్రధాన రహదారిపై గుంపులుగా ఉన్న కుక్కలు

వేలేరు : గ్రామాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా ప్రజలపై, వాహనదారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. వీధి కుక్కలను నివారించేలా ఆయా గ్రామాల పంచాయతీ అధికారులు,స్పెషల్ ఆఫీసర్లు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు పీచర, మల్లికుదుర్ల తదితర గ్రామాల్లో వందల సంఖ్యలో వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతూ దాడులకు తెగబడుతున్నాయి. బైక్‌పై వెళ్తున్న వారిని వెంబడించి మరీ కరుస్తున్నాయి. కుక్కలు వెంటపడుతుండటంతో భయాందోళన చెందుతున్న వాహనదారులు వేగంగా వెళ్లి ప్రమాదాల బారినపడుతున్నారు. అలాగే వ్యవసాయ బావుల వద్ద ఉండే దూడలపై దాడి చేసి హతమార్చిన సంఘటనలు కూడా ఇటీవల చోటుచేసుకున్నాయని, ఇప్పటికైనా అధికారులు చర్య తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాల నిర్మూలనకు పాటుపడాలి



ఖిలా వరంగల్: ఆటో డ్రైవర్లు సామాజిక బాధ్యతగా వాహనం నడిపి ప్రమాదాల నిర్మూలనకు పాటుపడాలని ఎంవీఐలు జైపాల్‌రెడ్డి, శోభన్‌బాబు సూచించారు. జాతీయ రోడ్డు రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో రవాణాశాఖ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు. అతివేగంతో వాహనాన్ని నడపడమంటే ప్రమాదాలు కొని తెచ్చుకోవడమేనని పేర్కొన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, మద్యం తాగి వాహనాన్ని నడిపితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను తరలించవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీఏ ఏఓ నరేందర్, ఆర్టీఏ కానిస్టేబుళ్లు, సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎల్.మూర్తి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్.మూర్తి

విద్యారణ్యపురి: రాష్ట్రంలో అద్దె భవనాల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్.మూర్తి డిమాండ్ చేశారు. హనుమకొండలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సంఘం జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. అద్దె భవనాల్లో అరకొర వసతులతో గురుకుల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.7,200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిపుల బకాయిలు ఉన్నాయని అన్నారు. విద్యాశాఖ మంత్రిని నియమించి, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, కార్యదర్శి మంద శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు కల్యాణ్ పరిమళ, జిల్లా సహాయ కార్యదర్శి అనూష పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



హసన్‌పర్తి: అక్రమంగా తరలిస్తున్న రూ.75 వేల విలువైన రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. హసన్‌పర్తి పద్మశాలి కాలనీ నుంచి అంబాల్ వైపునకు టాటా ఏస్ వాహనంలో తరలిస్తుండగా 30 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, డ్రైవర్ రాజును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై దేవేందర్ వివరించారు.

గ్రామాల అభివృద్ధికి బీజేపీ కృషి

- మండల అధ్యక్షుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

కమలాపూర్ : గ్రామాల అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ర్యాకం శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గతంలో అప్పటి ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఈటల రాజేందర్ ప్రత్యేక చొరవతో మండలంలో అభివృద్ధి జరిగిందని అన్నారు. ప్రస్తుతం కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ మండల అభివృద్ధి విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని అన్నారు. పలు అభివృద్ధి పనుల కోసం రూ.1.17 కోట్ల నిధులు కేటాయించడం హర్షించదగిన విషయమన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలు, అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు పంపితే మరో రూ.85 లక్షలు కేటాయిస్తానని చెప్పినట్లు తెలిపారు. ఉప్పులపల్లి నుంచి కందుగుల ఎస్సీ కాలనీ వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.2.20 కోట్లు కేటాయిస్తానని హామీ ఇవ్వడం సంతోషకరమని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఉప్పల్‌ను మండలం చేస్తానని చెప్పిన ప్రస్తుత ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మోసం చేశారని, బీఆర్ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అమలు సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలను మభ్య పెడుతుందని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు బండి కోటేశ్వర్, భిక్షపతి, ప్రవీణ్, రాంబాబు, రాజ్ మహ్మద్, సారంగపాణి, సుందరయ్య, రాజు, సుభాష్, రాజు, రాంబాబు, సురేష్, శ్రీనివాస్, చోటే మియా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సైకిల్ వాకర్స్ అసోసియేషన్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న గోపాల్‌రెడ్డి, బాధ్యులు

విద్యారణ్యపురి: సైకిల్ వాకర్స్ అసోసియేషన్ వరంగల్ శాఖకు అవార్డు లభించింది. 2024వ సంవత్సరంలో సైకిల్ వాకర్స్ అసోసియేషన్ వరంగల్ అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో హనుమకొండ ప్రాంతంలో స్వచ్ఛభారత్, హరితహారం, పర్యావరణ పరిరక్షణ, వాయు, జల కాలుష్య నివారణ, ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని చైతన్య కార్యక్రమాలు నిర్వహించడం, వృద్ధాశ్రమాలకు చేయూత ఇవ్వడం లాంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేసినందుకు అసోసియేషన్ వరంగల్ శాఖకు ఇటీవల ఏలూరులో నిర్వహించిన కన్వెన్షన్‌లో అవార్డును వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రదానం చేసింది. రూ.5 వేల విలువగల చెక్కును అందజేసి అభినందించారు. ఈమేరకు హనుమకొండలో అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి అధ్యక్షతన బాధ్యులు గురువారం సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి రమేష్, బాధ్యులు వేణుగోపాల్, సత్యం, రవిరాజు, సురేందర్, రాపర్తి లక్ష్మయ్య, శేఖర్‌గౌడ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

మడికొండ: ఓ మహిళపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మడికొండ ఎస్‌హెచ్ఓ కిషన్ తెలిపారు. కాజీపేట మండలం కడికొండ గ్రామానికి చెందిన మేకల చంద్రమౌళి.. కడిపికొండలో సాదినేని సుజాత ఇంటిపక్కన పాత ఇల్లు కొనుగోలు చేశాడు. ఇంటి ముందు ప్రహరీ విషయంలో సుజాతతో చంద్రమౌళి గతంలో గొడవ పడ్డాడు. గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా జరిగింది. ఈక్రమంలో పెద్ద మనుషులపై చంద్రమౌళి దుర్భాషలాడగా, వారు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయినా కూడా అతనిలో మార్పు రాలేదు. గురువారం మధ్యాహ్నం ఇంటి వద్ద పని చేసుకుంటున్న సుజాతపై చంద్రమౌళి ఇటుకతో దాడి చేయగా ఆమె తలపై తీవ్ర గాయమైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు చంద్రమౌళిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ వివరించారు.

సదస్సును విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యమకారులు

వరంగల్: తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యమకారుల ఫోరం వరంగల్ మండల అధ్యక్షుడు కందగట్ల మోహన్ పిలుపునిచ్చారు. ఆరెపల్లిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 19న డాక్టర్ చీమ శ్రీనివాస్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చేపడుతున్న ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనానికి తెలంగాణ రాష్ట్ర సాధనకు పోరాడిన ఉద్యమకారులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఉద్యమకారులు బుద్దె శ్రీనివాస్, వెంకన్న, రాజేశ్వర్‌రావు, జనగాం కుమారస్వామి, రవీందర్, కుమార్, రాజు పాల్గొన్నారు.

సన్నాహక ప్రదర్శనను జయప్రదం చేయాలి



కమలాపూర్ : మాట్లాడుతున్న రాజు



దామెర : ల్యాదెళ్లలో ప్రదర్శన చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కమలాపూర్ : ఈనెల 20వ తేదీన హనుమకొండ జిల్లా కేంద్రంలో నిర్వహించే వెయ్యి గొంతులు, లక్ష డప్పుల సన్నాహక ప్రదర్శనను జయప్రదం చేయాలని ఎమ్మెస్పీ రాష్ట్ర నాయకుడు, హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ మంద రాజు మాదిగ పిలుపునిచ్చారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ముత్యాల రమేశ్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలనే డిమాండ్‌తో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన వెయ్యి గొంతులు, లక్ష డప్పుల మహా ప్రదర్శనకు తరలిరావాలని కోరారు. అందులో భాగంగా హనుమకొండలో సన్నాహక ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. ఈ సన్నాహక ప్రదర్శనకు పార్టీలకతీతంగా మాదిగలు డప్పుతో కదిలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు చిలువేరు సంపత్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి అంకిల్ల రాజు, ఎమ్మెస్పీ జిల్లా కార్యదర్శి శనిగరపు రవీందర్, నాయకులు నద్దునూరి ప్రసాద్, ఇనుముల చంద్రమౌళి, ఇసంపెల్లి రమేశ్, ప్రభాకర్, రాజ్‌కుమార్, ఆకునూరి సాంబయ్య, పుల్ల శ్రీనివాస్, ఇంసంపెల్లి అయిలయ్య, అంకిల్ల సారయ్య, వక్కల రాజు, ఆల్లకొండ నాగరాజు, రాజమల్లు పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : వెయ్యి గొంతులు, లక్ష డప్పులు కార్యక్రమంలో భాగంగా మండలంలోని ల్యాదెళ్లలో గురువారం ప్రద్శన చేపట్టినట్లు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోవిందు రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో భాగంగా ఈనెల 20వ తేదీన హనుమకొండలో సన్నాహక ప్రదర్శన ఉంటుందని చెప్పారు. ప్రతి ఒక్క మాదిగ ఉపకులాలకు చెందినవారు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మాదిగల హక్కుల సాధనకు పోరాటమే సరియైన మార్గమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని, లేని పక్షంలో మాదిగల చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డప్పు కళాకారుల సంఘం నాయకుడు కేతెపాక రాజు, నాయకులు భరత్, రాజ్‌కుమార్, జేమ్స్, రవి, శేఖర్, కుమార్, సాంబరాజు, శరత్, బాబు, రాజు, రవి, పవన్, ప్రమోద్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

కేయూ క్యాంపస్: ఫిబ్రవరి 24, 25వ తేదీల్లో కాకతీయ యూనివర్సిటీలోని జువాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను యూనివర్సిటీలో వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, జువాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ గురువారం ఆవిష్కరించారు. ఇన్నోవేటివ్ టెక్నిక్స్ ఇన్ యానిమల్ బయో టెక్నాలజీ అండ్ ఇమ్యునాలజీ ఫర్ డిసీస్ ప్రివెన్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ వెంకయ్య వివరించారు. కార్యక్రమంలో జువాలజీ విభాగం ప్రొఫెసర్ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా క్రికెట్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

హసన్‌పర్తి: మాస్టర్ క్రికెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా కోడెల మురళి, ఉపాధ్యక్షుడిగా బోయిని శశికాంత్, ప్రధాన కార్యదర్శిగా వల్లాల యుగంధర్, సహాయ కార్యదర్శిగా పప్పుల మోహన్, కోశాధికారిగా దయాకర్, ఉప కోశాధికారిగా తిరుపతి, సభ్యులుగా కాజీపేట శ్రీనివాస్, కనపర్తి రాజు, శీలం క్రాంతి, వెల్గెటి వెంకన్న, శీలం వంశీ, వేల్పుల సాయికుమార్, సలహాదారులుగా సురేష్, గోపి, సతీష్ ఎన్నికయ్యారు.

ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న షబ్బీర్‌అలీ

న్యూశాయంపేట: మైనార్టీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమ ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్‌అలీ అన్నారు. హైదరాబాద్‌లో టీఎస్ మేసా (తెలంగాణ స్టేట్ మైనారిటీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోషియేషన్) హనుమకొండ జిల్లా శాఖ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తమ సమస్యలపై షబ్బీర్‌అలీకి నాయకులు వినతిపత్రం అందించారు. అధ్యక్షుడు ఎస్‌డి.నన్నేసాహెబ్, ప్రధాన కార్యదర్శి ఎండీ.గౌస్‌పాషా, రాష్ట్ర కోఆర్డినేటర్లు ఎంఏ.అజీజ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



వరంగల్: కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన చెన్నూరి వెంకటేశ్వర్లుకు బుధవారం రాత్రి ఫిట్స్ రావడంతో మృతి చెందారు. అతడి తండ్రి పదేళ్ల క్రితం, తల్లి రెండు నెలల క్రితం చనిపోగా వికలాంగుడైన తమ్ముడు మాత్రమే ఉన్నాడు. వరంగల్ జిల్లా హోల్‌సేల్, రిటైల్ కూరగాయల మార్కెట్ కమిటీకి చెందిన ప్రతినిధులు రూ.10 వేలను దహన సంస్కారాల నిమిత్తం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు బిట్ల కృష్ణ, కొండా హరి, నమిండ్ల సూరయ్య, సర్వర్, బూర ప్రకాష్, రమేష్, హరీష్, రాజు పాల్గొన్నారు.